HMDA & RERA Approved
కాసా త్రయంబక్, గుండ్ల పోచంపల్లి, కొంపల్లి

Casa Traimbak, Gundla Pochampally, Kompally,Hyd
2 & 3 Bed room flats are ready to occupy
Corporate Office: 2nd Floor, Green tech Square, Kavuri Hills, Hyderabad
Ph No: +91 89824 38982

# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూలై 20 2025 | సంపుటి :0 | సంచిక :275 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## అపోలోలో హైకోర్టు న్యాయమూర్తికి సిఎం పరామర్శ

జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హైకోర్టు న్యాయమూర్తి సీవీ భాస్కర్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా



## ఉరేసుకుని స్కూల్ టీచర్ ఆత్మహత్య

### స్నేహితుల వేధింపులే కారణమంటూ సెల్ఫీ



మేడ్చల్‌లోని లాడ్జిలో మెదక్ జిల్లాకు చెందిన గవర్నమెంట్ స్కూల్ టీచర్ ఉరేసుకుని చనిపోయన ఘటన కలకలం రేపింది. మెదక్ పట్టణానికి చెందిన గవర్నమెంట్ టీచర్ కాముని రమేష్ శనివారం మేడ్చల్ లోని ఓ లాడ్జిలో ఉరేసుకుని ప్రాణం తీసుకున్నాడు. 2లో



## దౌత్య విభేదాల తర్వాత..

### తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు యూకే , మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోదీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

2లో

- గత జనవరిలో ప్రధాని మోదీ లక్షద్వీప్‌ను సందర్శించి, సాహసాలు చేయాలనుకున్నవారు అక్కడికి రావాలని పిలుపునిచ్చారు.
- దీనిపై మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీశాయి.
- దీని పర్యవసానంగా, అనేక మంది భారతీయులు మాల్దీవుల పర్యాటక ప్రణాళికలను రద్దు చేసుకున్నారు. సోషల్ మీడియాలో BoycottMaldives హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయింది.
- మాల్దీవులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టి, ఆ వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని తెలిపి, సదరు మంత్రులపై వేటు వేసింది.

## హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం



హైదరాబాద్: హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జాప్యం లేకుండా త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్‌లో వర్షాలపై స్వయంగా ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో ఎక్కడైనా ఇబ్బందుల ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, పోలీస్ కమిషనర్, వాటర్ వర్క్ ఇతర అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు.

# 2026 నాటికి కాజీపేటలో రైల్వే కోచ్‌ల ఉత్పత్తి

ఖాజీపేట రైల్వే మానుఫ్యాక్చరింగ్ ప్రాజెక్ట్ వల్ల చాలా మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. దేశంలోనే ఇది.. పెద్ద రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ అని.. వందేభారత్ బోగీలు కూడా ఇక్కడే తయారవుతాయని మంత్రి వెల్లడించారు. 2026 నాటికి కాజీపేటలో రైల్వే కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం అవుతుందని.. కాజీపేట నుంచి త్వరలోనే 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి అవుతాయని కేంద్రమంత్రి చెప్పారు. త్వరలోనే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయావుతాయని రైల్వే మంత్రి చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతీయ రైల్వేలు పురోగమిస్తున్నాయని మంత్రి వెల్లడించారు. కాజీపేటలో 750 కోట్ల రూపాయలతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పనుల పరిశీలన నిమిత్తం శనివారం కేంద్రమంత్రులు యూనిట్‌ను సందర్శించారు. తెలంగాణలో ఇదో పెద్ద ప్రాజెక్టు అని చెప్పిన కేంద్రమంత్రి.. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. అనంతరం అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ..కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం నిర్మిస్తోందని..పనులు వేగంగా సాగుతున్నా యని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని.. ఆ కోరికను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

2లో

- »750 కోట్లతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్
- »శరవేగంగా సాగుతున్న కోచ్ ఫ్యాక్టరీ పనులు
- »వందేభారత్ బోగీలు కూడా ఇక్కడే తయారీ
- »పనులను పరిశీలించిన అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి



## ఫోన్ ట్యాపింగ్ కేసు

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ నోటీసులు



ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో విచారణలో భాగంగా మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ అధికారులు నోటీసులు అందించారు. నోటీసు అందుకున్న రెండు రోజుల్లో ఉదయం 11 నుండి సాయంత్రం 6 గంటల్లోపు వాగ్మూలం ఇచ్చేందుకు తమ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. కాగా సిట్ నోటీసులపై ప్రవీణ్ కుమార్ స్పందించలేదు. వాగ్మూలం ఇచ్చేందుకు ఆయన నిరాకరించినట్లు- తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాల్సి వస్తుందనే నిరాకరిస్తున్నట్లు- సమాచారం. అయితే ఈనెల 14 న ప్రవీణ్ కుమార్‌కు సిట్ నోటీసులు ఇవ్వగా ఆయన ఇంకా స్పందించలేదు. గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో.. బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోన్ ను హ్యాక్ చేస్తుందని, ఫోన్ ట్యాపింగ్ కి పాల్పడుతుందని కేంద్ర ఎన్నికల సంఘంతో డీజీపీకి ఆయన ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వాటి ఆధారంగానే ప్రవీణ్ కుమార్‌కు నోటీసులు ఇచ్చారు.

## కడుపులో కత్తులు పెట్టుకుని రాజకీయం చేయడం చేతకాదు: ఈటల రాజేందర్



మిగతాది 2లో

## పదేళ్లు తానే సీఎం అని రేవంత్ చెప్పడం సరికాదు: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. "పదేళ్లు తానే సీఎం అని రేవంత్ చెప్పడం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాలతోనే ఎన్నిక ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా సీఎం ఎన్నిక జరుగుతుంది. తెలంగాణలోని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలు సహించం. నిఖార్సయిన నేతలు, కార్యకర్తలు ఎవరూ ఇలాంటివి సహించరు" అని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూలై 20 2025

# సంపాదకీయం

## నాటో మొరటు భాష!



ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారంటారు. కానీ ఆర్నెల్ల నిరీక్షణ తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో కొద్దో గొప్పో సయోధ్య కుదిరేసరికి నాటో కూటమి ఆయన లక్షణాలు పుణికి పుచ్చుకున్నట్టు కనబడుతోంది. రష్యాతో వాణిజ్యం సాగిస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ భారత్, చైనా, బ్రెజిల్ దేశాలకు చేసిన హెచ్చరిక దీన్నే చాటు తోంది. ట్రంప్‌తో నాలుగు రోజులక్రితం భేటీ అయ్యేవరకూ తన భవిష్యత్తు ఏమవుతుందోనన్న బెంగతో నాటో దిగాలుగా, అయోమయంగా వుంది. ఎందుకంటే నాటో ఖర్చులో సింహభాగం అమెరికాదే. అది తప్పుకున్న మరుక్షణం సంస్థ కుప్పకూలుతుంది. ట్రంప్ ప్రసన్న వదనంతో పలక రించేసరికి పులకరించి తన స్థాయి ఏమిటన్నది నాటో మరిచిందని రూట్ మాటలు చెబుతున్నాయి. ఈ మూడు దేశాలూ యుద్ధం వద్దని రష్యాకు నచ్చజెప్పాలట. లేనట్టయితే ఆ పర్యవసానాలు ఈ దేశాలూ ఎదుర్కొనాల్సి వస్తుందట. ఇంకా వలస పాలన మాటున దోపిడీ సాగించిన నాటి రోజులే వున్నాయని రూట్ భ్రమపడుతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని ఎవరూ సమర్థించరు. అలాగే గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం, ఇటీవల ఆ దేశమే ఇరాన్‌పై చేసిన దాడి, దానికి వత్తాసుగా అమెరికా సాగించిన దాడులు అంగీకరించరు. నాటో దన్నుతో ఉక్రె యిన్ కావాలని రష్యాతో గిల్లికజ్జాలకు దిగిన వైనం అందరికీ తెలుసు. తమ చేతికి మట్టి అంటకుండా రష్యాను దెబ్బతీసి, దాన్ని సర్వనాశనం చేయగలమన్న భ్రమలో యూరప్ దేశాలు ఉక్రె యిన్‌ను ఉసిగొల్పాయి. కానీ మూడేళ్లయినా ఆ యుద్ధం ఆగకపోవటంతో యూరప్ దేశాలకు దిక్కు తోచటం లేదు. ఆ నిరాశా నిస్పృహల పర్యవసానంగానే నాటో కూటమి అతిగా మాట్లాడుతోంది. అటువంటి బెదిరింపులకు దిగేందుకు తనకున్న అర్హతేమిటో నాటో గమనించుకోలేదు. 1949లో ఆవిర్భావం మొదలుకొని దాని చరిత్రంతా దురాక్రమణలు, యుద్ధాలే. నిక్షేపంగా వున్న లిబియాపై చమురు, సహజవాయు నిక్షేపాల్ని కొల్లగొట్టడానికి దండెత్తి, రసాయన ఆయుధాలున్నా యంటూ ఆరోపించి, పాలకుడు గడాఫీని దారికి తెచ్చుకుని, ఆయన నిరాయుధుడు కాగానే సాయుధ మూతాలను ఎగతోసింది నాటోయే. ఆ మూతాలతో ఆయన్ను అత్యంత అమానుషంగా హత్య చేయించింది కూడా నాటోయే. 2011 మొదలుకొని ఇప్పటివరకూ ఆ దేశం అంతర్యుద్ధంతో సతమతమవుతోంది. బోస్నియా, హెర్జ్‌గోవినా, కొసావో, అఫ్గాన్, ఇరాక్, సోమాలియా తదితర చోట్ల అమెరికాతో కలిసి, విడిగా నాటో సృష్టించిన కల్లోలం సామాన్యమైంది కాదు. ఈ యుద్ధాల్లో లక్షలాది మంది పౌరులు మరణించారు. రష్యా%–%ఉక్రెయిన్ లడాయిలోఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక సాయాన్నందిస్తూ ఈ యుద్ధం ఆరకుండా కాపాడుతున్నది కూడా నాటోయే. అలాంటి సంస్థ ఏ అర్హతతో మననూ, వేరే దేశాలనూ బెదిరిస్తుంది? నాటో అనేది పుట్టుకనుంచీ అమెరికా కోసం, దాని ప్రయోజనాల పరిరక్షణ కోసం పనిచేస్తున్న పెద్ద పోలీస్. ఒక సైనిక కూటమిగా వుంటూ ప్రపంచ దేశాలపై ఆంక్షలు విధించటం సాధ్యమనే నాటో అనుకుంటున్నదా? ఆ పని యూరప్ దేశాలది. కానీ వాటికి హెచ్చరించటం సంగతలా వుంచి అడిగే ధైర్యం కూడా లేదు. ఒకనాడు సంపన్న రాజ్యాలుగా చలామణి అయిన యూరప్ దేశాలు ఇప్పుడు ఉత్పాదకతను పెంచటం ఎలాగో... అరకొర ఆర్థిక వ్యవస్థలతో ప్రజానీకంలో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చటం ఎలాగో అర్థంకాక తలలు పట్టుకుంటున్నాయి. ఈ దేశాలతో కూడిన నాటో మాత్రం పెద్ద మాటలు మాట్లాడుతోంది. ఇన్నేళ్ల అమెరికా సాహచర్యంతో ఇష్టాను సారం బడుగు దేశాలపై బలప్రయోగం చేయటం అలవాటైన నాటోకు ఈ ప్రపంచంలో ఐక్యరాజ్య సమితి, భద్రతామండలి వంటి అంతర్జాతీయ వేదికలున్నాయని కూడా గుర్తున్నట్టు లేదు. ఆంక్ష లైనా, విధినిషేధాలైనా వాటిద్వారా అమలు కావాలి. అదనంగా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటివి వున్నాయి. రష్యాతో వ్యాపారం చేయాలో లేదో అమెరికా, యూరప్‌సొంతంగా నిర్ణయించుకోవచ్చు. అందులో ఎవరూ జోక్యం చేసుకోలేరు. కానీ మేమే కాదు... ఎవరూ వ్యాపారం చేయకూడదంటే చెల్లదు. తన ఇంధన అవసరాలేమిటో, దాన్ని నెరవేర్చుకోవటానికి అనుసరించాల్సిన వ్యూహమేమిటో భారత్ ఆలోచించుకుంటుంది. రష్యాపై అమెరికా ఆంక్షలు విధించినా మన దేశం బేఖాతరుచేసింది. రష్యా చవగ్గా అమ్మజూపిన ముడి చమురు, సహజ వాయువు కొనుగోలు చేసింది. క్రితంతో పోలిస్తే 2023లో రష్యా నుంచి చమురు, సహజవాయు దిగుమతులు 1,500 శాతం పెరగటానికి ఇదే కారణం. చైనా, బ్రెజిల్ కూడా ఈ దోవనే వెళ్లాయి. రష్యాను ఏకాకిని చేయాలన్న పాశ్చాత్య ప్రపంచం కలల్ని బద్దలుకొట్టాయి. మన విదేశాంగ శాఖ నాటో ద్వంద్వ ప్రమాణాలను సరిగానే ఎత్తిచూపింది. ప్రజల ఇంధనావసరాలు మినహా తమకేదీ ప్రాముఖ్యంగల అంశం కాదని జవాబిచ్చింది. ఒకప్పుడు 27 దేశాల నుంచి ముడి చమురు కొనుగోలు చేసిన మన దేశం, ఇప్పుడు 40 దేశాలనుంచి కొంటున్నది. రష్యాపై తీసుకొచ్చిన అభిశంసనపై ఓటింగ్ జరిగినప్పుడల్లా ఐక్యరాజ్యసమితిలో మన దేశం గైర్హాజరైంది. అదే సమయంలో యుద్ధాన్ని విరమించాలని రష్యా అధినేత పుతిన్‌కు నచ్చజెప్పింది. అదే సలహా ఉక్రెయిన్‌కు కూడా ఇచ్చింది. ఇవి తెలియకుండా ఇష్టానుసారం మాట్లాడటం, హెచ్చరికలు జారీ చేయటం తగదని నాటో గుర్తించాలి. తెలిసీ తెలియ కుండా తగుదునమ్మా అని జోక్యం చేసుకుంటే వున్న పరువు కాస్తా పోతుందని గుర్తెరగాలి.

## కడుపులో కత్తులు పెట్టుకుని రాజకీయం చేయడం చేతకాదు: ఈటల రాజేందర్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: హుజూరాబాద్ అనేక త్యాగాలకు అడ్డా అని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో హుజూరాబాద్ భాజపా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ నుంచే అనేక పోరాటాలు చేశామన్నారు. కొందరు సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి రావడానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. తాను పదవుల కోసం పార్టీ మారలేదన్నారు. మనకు మనం భారత రాష్ట్ర సమితి నుంచి బయటకు రాలేదని.. వెళ్లగొట్టారని వ్యాఖ్యానించారు. 2021 నుంచి ఆ పార్టీలో నరకం అనుభవించానన్నారు.

"గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్‌కు నా నిర్ణయాలు మొహమాటం లేకుండా చెప్పాను. గతంలో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో ప్రజల ఆత్మగౌరవం గెలిచింది. నేను అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. గతంలో హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో నా ఓటమికి చాలా మంది కుట్రలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నా అడుగు పడని గ్రామాలు లేవు. నేను పోరాటాలు చేస్తే కరీంనగర్ ప్రజలు అండగా ఉండేవారు. హుజూరాబాద్ గడ్డలో ప్రతి గ్రామంలోని వార్డు సభ్యుడిని గెలిపిస్తాం.

రాజకీయాల్లో అవమానాలు, అవహేళనలు ఉంటాయని.. వాటిని తట్టుకున్నాం. నాకు స్ట్రయిట్ ఫైట్ తప్ప స్ట్రీట్ ఫైట్ రాదు. కడుపులో కత్తులు పెట్టుకుని రాజకీయం చేయడం మాకు చేతకాదు. పైకి ఒక మాట.. లోపల మరో మాట మాట్లాడటం తెలియదు. శత్రువుతో నేరుగా కొట్లాడతా. స్వరాష్ట్రం కోసం ఉద్యమం చేసిన చరిత్ర నాది. నాపై గతంలో కేసీఆర్.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారు. రాజకీయాల్లో అబద్ధాల పునాదులపై కొందరు బతుకుతున్నారు. నిజాయతీగా పార్టీ కోసం కష్టపడటం తప్ప నాకు మరొకటి తెలియదు. కాలం చాలా గొప్పది.

ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదు

హుజూరాబాద్ చైతన్యానికి మారుపేరు. క్యాడర్‌కు అందుబాటులో ఉంటా. ప్రజలు ఎప్పుడూ మోసం చేయరు. నా చరిత్రేంటో వారికి తెలుసు. ధీరుడు వెనుదిరగడు.. ఎంత వరకు ఓపిక పట్టాలో తెలుసు. వ్యక్తులు ఎదగకుండా పార్టీ బలపడదు. కార్యకర్తల ఆవేదన అర్థమైంది. వారి రాజకీయ అవసరాలు తీర్చలేనంత నిస్సహాయంగా లేను. నా అనుభవం వాడుకుంటే పార్టీకి ఉపయోగపడుతుంది. పదవులే పరమావధిగా భావించేవాడిని కాదు. ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి అంకితభావంతో పనిచేస్తా. ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదు. రాజకీయాల్లోనే కాదు.. అన్నింట్లోనో కోవర్టులు ఉంటారు. వారి గురించి ఆలోచించొద్దు. హుజూరాబాద్ వస్తా.. మీ వెంటే ఉంటా.. స్థానిక ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించుకుంటా. కార్యకర్తలు కుంగిపోవద్దు"అని ఈటల అన్నారు.

## 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా భారత్: అమిత్ షా



ఎన్డీఏ పాలనలో భారత్ ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ.. వేగంగా ముందుకు వెళ్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 2027 నాటికి దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ గా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో భాజపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేశంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పదేళ్లలో దేశాభివృద్ధిలో 60శాతం పెరుగుదల చోటుచేసుకుందని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా 45వేల కిలో మీటర్ల రైల్వే లైన్లు, రోడ్లు నిర్మించామని అమిత్ షా అన్నారు. ప్రధానిగా ఉన్న సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ దేశాన్ని 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చితే.. మోదీ దానిని నాలుగో స్థానానికి తీసుకువచ్చారన్నారు. త్వరలో భారత్‌ను ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా మార్చేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెడతానని ప్రధాని మోదీ ప్రతిజ్ఞ చేశారని.. దానికోసం తామందరం పని చేస్తున్నామని అన్నారు. దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్‌కు రానున్న రోజుల్లో ప్రపంచం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వచ్చేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అమిత్ షా అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచంలోని వివిధ కంపెనీలను ఆహ్వానించడం మొదలైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సీపీఐ నేత చందునాయక్ హత్య కేసు.. ఐదుగురి అరెస్ట్

సీపీఐ నేత కేతావత్ చందునాయక్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ ఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈనెల 15న మలక్‌పేట పరిధిలోని శాలివాహననగర్ పార్కులో చందునాయక్‌ను దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఐదుగురిని ఇవాళ అరెస్ట్ చేశారు.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ చైతన్య రెడ్డి మీడియాకు వెల్లడించారు. "ఈ నెల 15న మలక్‌పేటలో ఉదయం 7.30 గంటల సమయంలో పార్కు వద్ద చందునాయక్‌పై తుపాకీతో కాల్పులు జరిపారు. కారం చల్లి, కాల్పులు జరిపి నిందితులు పరారయ్యారు. చందునాయక్ సీపీఐ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు. ఈ కేసులో మొత్తం ఆరుగురి ప్రమేయం ఉంది. దొంతి రాజేశ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించాం. కాల్పులకు ముందు రోజు నిందితులు రెక్కీ కూడా నిర్వహించారు. చందునాయక్‌కు రాజేశ్‌తో విభేదాలున్నాయి. ఇద్దరూ భూదాన్ భూముల్లో సీపీఐ తరఫున పేదలతో గుడిసెలు వేయించారు. ఆ తర్వాత వారికి పట్టాలు ఇప్పించాలని నిర్ణయించుకున్నారు. రాజేశ్ కూడా తన తరఫున కొందరితో గుడిసెలు వేయించాలని భావించాడు. గుడిసెలు వేయించేందుకు రాజేశ్ 1300 మంది నుంచి డబ్బులు వసూలు చేశాడు.

## కులగణన డేటా మాత్రమే కాదు.. తెలంగాణ హెల్త్ చెకప్: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: రాష్ట్రంలో జరిగిన కులగణన కేవలం డేటా సేకరణ కాదని.. ఇది తెలంగాణ మెగా హెల్త్ చెకప్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి, సామాజిక న్యాయం అమలు చేసేందుకు కులగణన ఉపయోగపడుతుందన్నారు.

కులగణనపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. 300 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. కులాల వారీగా వెనుకబాటుతనాన్ని విశ్లేషించిన కమిటీ.. కొత్త పాలసీలతో పాటు ప్రస్తుత విధానాలను మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలను నివేదికలో పొందుపర్చింది. కమిటీ సూచనలపై కేబినెట్‌లో చర్చించి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోనుంది.

వెనుకబాటుతనంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య తేడాలు, వాటికి కారణాలను కూడా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన సర్వే చరిత్రాత్మకమైందని.. దేశానికి రోల్ మోడల్‌గా మారుతుందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, అధికారులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని స్కూల్ టీచర్ ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

చనిపోయే ముందు తీసుకున్న సెల్ఫీ వీడియోలో తన చావుకు ఫ్రెండ్స్ వేధింపులు కారణమని రమేష్ చెప్పాడు. ప్రస్తుతం హవేలీ ఘనపూర్ మండలం సర్ధన జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్ గతంలో తెలిసిన వారి దగ్గర పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. అప్పులు, వడ్డీలు భారమై చెల్లించలేక రమేష్ ఏడాది కిందట చేతులెత్తేశాడు. అప్పులిచ్చిన వారి ఒత్తిడితో మెదక్‌లో ఉన్న సొంత బిల్డింగ్, ప్లాట్లు- అమ్మి అప్పులు చెల్లించాడు. తీసుకున్న అప్పులు చెల్లించినప్పటికీ కొందరు ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారని, కోర్టులో చెక్ బౌన్స్ కేసులు వేసి ఇబ్బంది పెడుతున్నారని, భార్య,

పిల్లలను రోడ్డుకు ఈడ్చారని రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. తన మరణానికి కారణం అయిన వారిని కఠినంగా శిక్షించాలని సెల్ఫీ వీడియోలో ముఖ్యమంత్రి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్‌కు రమేష్ విజ్ఞప్తి చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టమ్‌కు పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 2026 నాటికి కాజీపేటలో రైల్వే కోచ్‌ల ఉత్పత్తి

మొదటి పేజీ తరువాయి

కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో కాజీపేట ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయావుతాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వరంగల్ ప్రజల కోరికను ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చారని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కాజీపేట రైల్వేకోచ్ పరిశ్రమ అనేది వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ అనేది 40 ఏళ్ల పోరాటమని, పివి నరసింహారావు కూడా కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నించారని కిషన్ రెడ్డి అన్నారు. రైల్వే వ్యాగన్లు, కోచ్ లు, ఇంజిన్ల తయారీ పరిశ్రమను కాజీపేటకు ప్రధాని మంజూరు చేశారని, మోడీ ఏదైనా మాట ఇస్తే.. తప్పకుండా నెరవేరుస్తారని పేర్కొన్నారు.మోడీ గ్యారెంటీకి ప్రతిరూపమే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ అని కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని స్వయంగా భూమిపూజ చేశారని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీతో 3 వేల మందికి నేరుగా ఉపాధి కల్పిస్తామని, తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తున్నాం అని తెలియజేశారు. వరంగల్ కు ఎయిర్ పోర్టు కూడా ఇప్పటికే రావాల్సి ఉందని, ఎయిర్ పోర్టుకు భూములివ్వాలని గతంలో మాజీ సిఎం కెసిఆర్ ను కోరామని చెప్పారు. భూసేకరణ గురించి ఈ ప్రభుత్వాన్ని కూడా అడుగుతున్నామని, ఎంత త్వరగా భూములిస్తే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు పూర్తవుతుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాజీపేట మానుఫ్యాక్చరింగ్ యూనిట్ తెలంగాణ ప్రజల చాలా ఏళ్ల కల అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

## దౌత్య విభేదాల తర్వాత.. తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు. జులై 23-24 తేదీలలో మొదట యూకేలో జరగనున్న భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై జరిగే చర్చల్లో మోదీ పాల్గొని..ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యూకే ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 25-26 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు. గతేడాది జనవరిలో లక్షద్వీప్‌ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ.. సాహసాలు చేయాలనుకున్నవారు ఇక్కడికి రావాలని పిలుపునిచ్చారు. దీనిపై మాల్దీవుల మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఇది ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలను దెబ్బతీసే స్థాయికి చేరింది. అనేకమంది భారతీయులు.. ఆ దేశ టూర్ ప్లాన్‌ను విరమించుకున్నారు. సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బాయ్‌కాట్ మాల్దీవ్స్ పేరిట హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయింది. ఆ వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టిన మాల్దీవులు.. ఆ వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. అనంతరం ఆ మంత్రులపైనా వేటు వేసింది. ఆ తర్వాత నుంచి అధ్యక్షుడు ముయిజ్జు తీసుకున్న భారత వ్యతిరేక నిర్ణయాలు కూడా ఇరుదేశాల మధ్య దూరాన్ని పెంచాయి.

# చింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

- విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడవద్దు
- విద్యార్థిని విద్యార్థులు లక్ష్య సాధన తో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలిలిఎం.హేమలత
- జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్






**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్.**
జాతీయ,రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు, మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సౌజన్యంతో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మండలం చింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎం.హేమలత,జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ వీరు విచ్చేసి ముందుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో స్వాగతంతో కళాశాలకు విచ్చేసి, కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్, లెక్చరర్స్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది, అనంతరం విద్యార్థులతో ఏర్పాటుచేసిన ఏంటి రాగి కార్యక్రమంలో న్యాయమూర్తి హేమలత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు జూనియర్ సీనియర్ అనే తేడా లేకుండా, కలిసిమెలిసి లక్ష్యసాధన తో పట్టుదలతో చదువుకొని చదువు చెప్పిన గురువుల, తల్లిదండ్రుల, కలలని సాఫల్యం చేయాలన్నారు. విద్యార్థులు రాగింటికి పాల్పడితే చట్టపరంగా కఠినంగా శిక్షించబడతారని మీ భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకోదన్నారు. విద్యార్థిని విద్యార్థులు మహనీయులను తీసుకొని పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలి అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు విధులు బాధ్యతలను, వివిధ చట్టాల పైన ప్రతి విద్యార్థిని విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు,
విద్యార్థులు కానీ గ్రామీణ ప్రాంత ప్రజలు కానీ చట్టపరమైనటువంటి సలహాలు సూచనలు అవసరం ఉన్నచో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ను ఆశ్రయించి న్యాయ సాయం పొందవచ్చు అన్నారు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.అదేప మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ధైర్యంగా ఉండాలని చిన్నచిన్న సమస్యలకే కుంగిపోవద్దని మనో ధైర్యాన్ని ఇస్తూ మాట్లాడడం జరిగింది, ర్యాగింగ్ నిర్మూలించుటకు సమిష్టిగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది, అనంతరం ఎం. హేమలత ను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులు శాలువా బొకేతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏ ఎస్ ఐ, నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఆదెప్ప,డా.సురేష్, కార్యక్రమ నిర్వాహకులు. అధ్యాపకులు సమీరా, శ్రీనివాస్, రమేష్, రవి, ఆరిఫ్, హేమంత్, లీగల్ సర్వీస్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## వాడపల్లిలో భక్తుల కోసం దేవస్థానం చేసిన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే బండారు....



**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్ ప్యాకెట్ల సరఫరా తదితర అంశాలను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావును అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్ల లోని భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా మరిన్ని కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, మాడవీధుల బయట తాత్కాలిక క్యూలైన్లలో భక్తులకు ఎండ తగలకుండా మరిన్ని టెంట్లు ఏర్పాటు చేయాలని, భక్తులు వేచి ఉండే సమయంలో అనారోగ్య సమస్యలు ఏర్పడితే వారికి మెరుగైన వైద్యం అందించేలా ఆరోగ్య సిబ్బందిని మరింతమందిని పెంచాలని డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కలిగేలా చూడాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# రోడ్డు మరమ్మతు చేయించిన ప్రజా సేవకుడు

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకట్ రెడ్డి




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని అమ్మక్కపేట నుండి మెట్ పల్లికి వెళ్లే మార్గంలో రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి కింద రోడ్డు బురదమయం కావడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.
రైల్వే గేట్ పడినప్పుడు వాహనదారులు అండర్ పాస్ బ్రిడ్జి కిందకి వెళ్లే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీంతో ఎవరూ ఆ రోడ్డు దుస్థితిని పట్టించుకోవాడంలేదు. దీనివల్ల మేడిపల్లి చౌరస్తాలో పూర్తిగా గుంతలు ఏర్పడడంతో శనివారం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకట్ రెడ్డి రుపాయలు 20 వేలతో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద, మేడిపల్లి క్రాసింగ్ పైన రోడ్డుపైన మొరం పోయించి, డస్టు పోసి డోజర్ తో వాహన దారులకు రహదారి అందు బాటులోకి తెచ్చారు. వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు,అన్ని పార్టీల నాయకులు,కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు శ్రీ ఎల్లాల వెంకట్ రెడ్డి ని అభినందించారు.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న శాసనమండలి సభ్యులు బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు



**ఆత్రేయపురం(ఏపీ) కరపత్రం ప్రతినిధి**
వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న శాసనమండలి సభ్యులు బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు దంపతులు మరియు మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి దంపతులు వారికీ ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి ప్రసాదం, ఫోటో ను బహుకరించారు. ఆయన వెంట రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం, తమలంపూడి రామకృష్ణ రెడ్డి, రాష్ట్ర యువ మోర్చ అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ, నియోజకవర్గం కన్వీనర్ అయనవిల్లి సత్తిబాబు, స్టేట్ కౌన్సిల్ నెంబర్ శిష్ట కుటుంబ రావు, రాష్ట్ర యువ మోర్చా కార్యదర్శి కలబత్తుల చ్చిన్నారీ, మాజీ అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, మండల అధ్యక్షులు u. వెంకటేశ్వరరావు, సంపతీ కనకేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దం శెట్టి శ్రీనివాస్, పెన్నాడా చిన్నా, బొర్రా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వభారతిలో బోనాల సందడి...











**పెద్దపల్లి జిల్లా రామగుండం:జూలై 19 కరపత్రం ప్రతినిధి**
బోనాల పండుగను పురస్కరించుకొని విశ్వభారతి విద్యాసంస్థల్లో శనివారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల చేత బోనాలు తీసుకొని ఊరేగింపుగా పాఠశాలలో నెలకొల్పి అమ్మవారికి పూజలు చేసి బోనాల జాతరను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ యాదగిరి గౌడ్ మాట్లాడుతూ.... ప్రకృతి సిద్ధంగా వచ్చినటువంటి పండుగలు అన్నీ కూడా ప్రకృతి నీ పూజించడానికి మన తెలంగాణ సంప్రదాయాన్ని గౌరవించడానికి ఈ పండుగలు మనం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేస్తూ, తెలంగాణ అంతటా కూడా ఈ సందర్భంగా బోనాల జాతరను చేసుకుంటారని, బోనాల జాతర గురించి దాని ప్రత్యేకతల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు సంప్రదాయ దుస్తుల్లో, విద్యార్థులు పోతురాజుల దృశ్యంలతో నృత్యాలు చేస్తూ బోనాలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## మందపల్లి శనీశ్వరునికి ఘణంగా తైలాభిషేకములు





**కొత్తపేట(ఏపీ) కరపత్రం ప్రతినిధి**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర(శనీశ్వర) స్వామి వారి దేవస్థానంలో శనివారం తైలాభిషేక మహోత్సవాలు శ్రద్ధాభక్తులతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తైలాభిషేక సేవలకు భక్తులు అందించిన విరాళాలు 1,65,150రూపాయలు కాగా, అన్న ప్రసాదానికి విరాళాలుగా 29,830రూపాయలు స్వీకరించబడినాయి. మొత్తం ఆదాయం 1,94,980 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారిసహాయక కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు

# టీబీజీకేఎస్ నాయకుల అక్రమ బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజి రెడ్డి




**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
రామగుండం 2 ఏరియాలో పనిచేస్తున్న టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ఆర్జీవన్ లో ఇపీ ఆపరేటర్ గా పని చేస్తున్న డిప్యూటీ జనరల్ సెక్రటరీ జావిద్ పాషా, టిఆర్ఎస్ నాయకుడు బాలసాని కొమురయ్య గౌడ్ ని ఎలాంటి కారణం లేకుండానే యాజమాన్యం అక్రమంగా బదిలీ చేయడం సమంజసం కాదని, బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజి రెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నాయకులపై గతంలో ఎలాంటి చారుషీట్లు గాని ఆరోపణలు కానీ లేవని రాజకీయ ప్రోద్బలంతోనే ఈ బదిలీలు జరిగాయని, రామ్మూర్తి, కొమురయ్య సంవత్సరంలో రిటైర్ కానున్నారని వెంటనే ఈ బదిలీలను నిలుపుదల చేయాలని వారు కోరారు. లేనియెడల సింగరేణి వ్యాప్తంగా కార్మికులు అన్ని యూనియన్లతో కూడగట్టుకొని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, ప్రవీణ్ కుమార్, చిలకలపల్లి శ్రీనివాస్, కొండ్రా అంజయ్య రొడ్డ సంపత్, మీస రాజు, పల్లె సురేందర్, జనగామ మల్లేష్, వాసర్ల జోసెఫ్, సాయి చరణ్, పర్లపల్లి అభిషేక్, పుప్పాల రవీందర్, బొగ్గుల సాయి, అప్సర్ పాష, గడ్డి శ్రీనివాస్ కళాదర్, మహేష్ మార్కా వెంకటస్వామి, నరేష్ వెంకట్ రెడ్డి, ఆరిఫ్ ప్రదీప్, కరటె రాములు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్ల షోరూమ్‌లోకి వరద

భారీ వర్షంతో రసూల్‌పురలోని పైగా కాలనీ విమాన నగర్‌లో వరద బీభత్సం సృష్టించింది. ఓ కార్ల షోరూమ్‌లోకి 4 అడుగుల మేర వరద చేరింది. దీంతో అందులో పనిచేస్తున్న సుమారు 30 మంది సిబ్బంది చిక్కుకున్నారు. తమను రక్షించాలని పోలీసు, డీఆర్ఎఫ్, హైడ్రా అధికారులకు షోరూమ్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. హైడ్రా బృందం రంగంలోకి దిగి షోరూమ్ వెనుక వైపు నుంచి వారిని తరలించారు. బోట్ల ద్వారా వారిని బయటకు తీసుకొచ్చారు.

# నేను ఎవరికీ భయపడేది లేదు... బండి సంజయ్‌కి స్ట్రాంగ్ కౌంటర్





**కరపత్రం ప్రతినిధి మల్కాజ్గిరి జులై 19**
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కి బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హుజురాబాద్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శామీర్‌పేట్‌లోని ఈటల రాజేందర్ ఇంటికి ఇవాళ(శనివారం) కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఈటల రాజేందర్ మాట్లాడారు. హుజురాబాద్ తెలంగాణ ప్రతీకకు అడ్డా అని ఉద్ఘాటించారు. ఇక నుంచి అక్కడ స్ట్రైట్ ఫైట్ ఉంటుందని.. స్ట్రీట్ ఫైట్ మాత్రం ఉండదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో అవమానాలు, అవహేళనలను దాటి తాను ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు. అప్పుడు కేసీఆర్ తన విషయంలో చేసింది అదేనని గుర్తుచేశారు. అయినా హుజురాబాద్ బిడ్డలు తనను కాపాడుకున్నారని ఉద్ఘాటించారు. తాను అలాగే వారిని కాపాడుకుంటానని మాటిచ్చారు. దక్షిణ భారతదేశంలో తన నియోజకవర్గానికి నేరుగా వచ్చి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశం పెట్టారని గుర్తుచేశారు ఎంపీ ఈటల రాజేందర్.

శత్రువుతో కొట్లాడవచ్చు కానీ కడుపులో కత్తులు పెట్టుకొనే వారితో పోరాటం చేయలేమని విమర్శించారు. భారతీయ జనతా పార్టీలో అన్నిరకాల అంశాలని పరిగణనలోకి తీసుకుంటారనే ఈ పార్టీలో చేరానని చెప్పుకొచ్చారు. తెలంగాణలో తాను తొక్కని ఇంటి గడప లేదని.. తనకు తెలియని వారు లేరని... బీసీ బిడ్డగా తాను మంత్రి పదవులు పొందానని గుర్తుచేశారు. దేశ ప్రధాని మోదీ వ్యక్తుల కోసం కాకుండా.. వ్యవస్థ నిర్మాణం కోసం పని చేస్తున్నారని నొక్కిచెప్పారు. మనమంతా దేశ ధర్మం కోసం కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో కొంతమంది ఉంటారని.. వారు ఇతరులను ఎదగనివ్వకుండా చేయడమే వాళ్ల పని అని విమర్శించారు ఎంపీ ఈటల రాజేందర్. కచ్చితంగా హుజురాబాద్ వస్తా.. మీ వెంట ఉంటానని హామీ ఇచ్చారు. తనను ఏడుసార్లు గెలిపించారని... ఎవరికీ భయపడేది లేదని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో చిన్న మనస్కులు, కురుస మనస్తత్వం ఉన్న వాళ్లు ఉంటారని తెలిపారు. వాళ్ల కడుపులో కత్తులు పెట్టుకొని ఉంటారని.. అలాంటిది వారితో యుద్ధం చేయడం కష్టమే కానీ ఎదురెళ్లి నిలబడాలని చెప్పుకొచ్చారు. ఇక నుంచి హుజురాబాద్‌లో ప్రతి మండలానికి ఒక కార్యాలయం ఉంటుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ,కేసీఆర్ లాంటి వాళ్లతో తాను కొట్లాడానని గుర్తుచేశారు. సముద్రంలో తుపాన్ వచ్చే ముందు సైలెంట్‌గా ఉంటుందని చెప్పుకొచ్చారు. తన లాంటి వాళ్లు మాట్లాడితే సమాజం రియాక్ట్ అవుతుందని.. తాను ప్రజల నుంచి వచ్చిన వాడినని, ప్రజలే తనకు న్యాయ నిర్ణేతలని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు

## కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా బోనాల పండుగ ఉత్సవాలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 19**
తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేటువంటి విధంగా జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బోనాల పండుగ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నెత్తిన బోనాలు పెట్టుకుని నైవేద్యాలు సమర్పించారు. మండల విద్యాధికారి హేమలత ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు చేసిన బోనాన్ని నెత్తిన పెట్టుకొని ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సంబరాలలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దబ్బెట రవీందర్ బలరాం విద్యా కమిటీ చైర్మన్ గుండ్ల రాజు, వాలంటీర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# పలు ఎరువులు దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు...

- మండలం లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయి...
- కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్ల పై కఠిన చర్యలు ...
- నానో యూరియాని వాడి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడుల పొందండి....
- పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్...





**కరపత్రం ప్రతినిధి పెద్దపల్లి జిల్లా పాలకుర్తి జూలై 19**
ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా ప్రాథమిక సహకార సంఘాలు కన్నాల, మేడిపల్లి (కుక్కల గూడూరు గ్రామంలో , ఈసాలతక్కలపల్లి లో గ్రామ బ్రాంచ్ లైసెన్సు కలగి ఉన్న ) కేంద్రాలు నందు , డీసీఎంఎస్ పుట్నూరు ద్వారా రైతులకు యూరియా నిరంతరంగా సరఫరా చేస్తోందనీ,పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ఒక ప్రకటన లో తెలియజేసారు. ఈ సందర్భంగా మండలం లోని పలు ఎరువులు దుకాణాలపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం పాలకుర్తి మండలంలో ని శ్రీరామ ట్రేడర్స్ పాలకుర్తి ,వాసవి ఫెర్టిలైజర్ బసంత నగర్, ఓం సాయి ఫెర్టిలైజర్స్ , శ్రీ ఆంజనేయ ఫెర్టిలైజర్స్ -కుక్కల గూడరు లో యూరియా రికార్డులు తనిఖీ చేశారు .రికార్డులో ఉన్న స్టాక్, గోదాములో ఉన్న సరుకులను సక్రమంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు.

ఈ సందర్భంగా పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ....

అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు లేదా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తో పాటు డీలర్ లైసెన్సు సస్పెండ్ కి గురవుతుందనీ అన్నారు.

రైతులు నానో యూరియా విధిగా పిచికారీ చేయండనీ, రైతులు ఇంతవరకు నత్రజని ఏరువు కోసం యూరియా ను ఘన రూపకంగా (బస్తాలు రూపంలో ) ఇప్పటి వరకు వాడుతున్నారనీ ,ఇప్పుడు మరోవిధంగా బస్తాల రూపకంగా కాకుండా నానో యూరియా ద్రవ రూపంలో (బాటిల్స్ రూపంలో ) పంట ఆకుల పై కూడా పిచికారీ చేసి ఇదివరి కంటే తక్కువ ఖర్చు తో మంచి దిగుబడులు పొందవచ్చుననీ,ఈ నానో యూరియా ను అన్ని పంట ఆకుల పై పిచికారీ చేసుకొని మంచి ఫలితాలు పొందవచ్చనీ,అంటే పంట విత్తిన / నాటిన తరువాత , కొద్దిగా పంట పెరిగి ఆకుల ఏర్పడిన పిదప , పై పాటుగా ఈ నానో యూరియా ను ఆకులు బాగా తడిచేటట్లు చేతి పంపు / పవర్ స్ప్రేయర్ / డ్రోన్ ద్వారా పిచ్చికారీ చేసుకోవచ్చనీ,

యూరియా బస్తాలు కొని వేయాలంటే, కూలీల ఖర్చు చాలా ఎక్కువ అని,కాని ఈ నానో యూరియా ద్వారా ఇబ్బంది లేకుండా పంట పై పిచికారీ చేస్తే సరిపోతుందనీ, అట్లాగే వరి నాటి దుబ్బు చేస్తే దగ్గర నుండి ఈ నానో యూరియా పిచికారీ చేసుకోవచ్చనీ వారు తెలిపారు.

పాత పద్ధతి ( బస్తాలు )వాడినప్పుడు 30% ఎరువు పనితనం ఉంటుందనీ ,అదే నానో యూరియా వాడినప్పుడు పనితనం 80% వరకు ఉంటుందనీ ,దీనికి తోడు యూరియా తో పోల్చితే నానో యూరియా చవక అని,ఒక ఎకరానికి : అర లీటర్ సరి పోతుందనీ,ధర : రూ ..225 మాత్రమే అని,పంటల పై 2 - 3 ధపాలు గా పిచికారీ చేసుకోవాలనీ ఆయన వివరించారు.

ఈ నానో యూరియాని వాడి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## నీటి విడుదల కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి వినతి పత్రం అందజేసిన ఆవుల రాజిరెడ్డి గారు



**కరపత్రం ప్రతినిధి దిన పత్రిక మెదక్ నర్సాపూర్**
నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి గౌరవ ఉత్తమ్ కుమార్ రెడ్డిని వారి కార్యాలయంలో కలసి, సాగునీటి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో కొండ పోచమ్మ రిజర్వాయర్ నుంచి హల్దీ వాగు ద్వారా వెల్దుర్తి, మాసాయిపేట్, కొల్చారం మండలాలకు, అలాగే సింగూరు రిజర్వాయర్ నుంచి కొల్చారం మండలంలోని సాగు భూములకు తక్షణం నీటిని విడుదల చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, ఆయా ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయడం కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## రైతు చివరి ఆయకట్టు వరకు నీరంధించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం

### - ఎమ్మెల్యే మక్కాన్సింగ్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 19:**
వ్యవసాయ సాగు రైతుల అభిప్రాయం మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పల్లికొండ రాజేష్ ఈదునూరి హరిప్రసాద్, మేడి ఒదేలు వరినాట్ల సమయంలో రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ కి క్యాంప్ కార్యాలయంలో తెలిపారు. వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చరవాణిలో రామగుండం పెద్ద చెరువును ఆనుకొని రాయదండి, పెద్దంపేట, రామగుండం, పాముల పేట, లింగాపూర్ గ్రామాల రైతులు వ్యవసాయం సాగు చేసుకునే జీవనం పొందుతున్నారని, ప్రతి రైతు చివరి ఆయకట్టు వరకు నిరంధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తున్నదని, తక్షణమే పెద్ద చెరువులోకి సాగునీటిని పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు. స్పందించిన అధికారులు శాసనసభ్యులు మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు తక్షణమే సాగునీటిని పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే తీసుకున్న చొరవకు రైతులంతా హర్షం వ్యక్తం చేశారు.

# కొత్తపల్లి హైస్కూల్లో ముందస్తు బోనాల జాతర

- విద్యార్థుల్లో అంబరాన్నింటిన సంబరాలు





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 19**
జమ్మికుంట స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ కొత్తపల్లిలో విద్యార్థినీ విద్యార్థులు ముందస్తు బోనాల జాతర ఉత్సవాలను ను ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయుల సహకారముతో బోనాలను వండి పక్కనే ఉన్న అమ్మవారి ఆలయంలో బోనాల నివేదనము చేశారు. ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం మొదటి సారని,చాలా సంతోషాన్ని కలిగించిందని విద్యార్థులు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణములో జరిగిన సంబరాలలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే పాటలతో కోలాటం కార్యక్రమం నిర్వహించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిలో భాగమని,తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి తెలంగాణ సంస్కృతిని తెలుసుకోవడానికి ఇటువంటి పండుగలు ఎంతో దోహదం చేస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జరీనా అంజుమ్ విద్యార్థులకు వివరించారు. మధ్యాహ్న భోజనములో మధ్యాహ్న భోజనముతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులందరికీ మిఠాయిలను అందించారు. అనంతరము మెహందీ సెలబ్రేషన్ కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణములో నిర్వహించగా విద్యార్థినీలు ఆ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతియేట ఆషాడ మాసములో తెలుగింటి ఆడపడుచులందరు గోరింటాకు పెట్టుకోడం అనవాయితీగా వస్తుందని ఈ కాలములో వర్షాలు బాగా కురువడం వలన స్త్రీల కాళ్ళల్లో రోగకారక క్రిములు చేరి అనారోగ్యాన్ని కలిగిస్తాయని అటివంటి క్రిములు దరిచేరకుండా గోరింట పనిచేస్తుందని, అంటే ఇందులో ఆరోగ్య సూత్రాలు కూడా దాగి ఉన్నాయని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేందర్, రమేష్,సంతోష్ కుమార్, అవినాష్,స్రవంతి,రేణుక మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉషోదయ హైస్కూల్ లో బోనాల వేడుకలు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 19:**
గోదావరిఖని రమేష్ నగర్ లోని ఉషోదయ హైస్కూల్ లో బోనాల వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు అమ్మవారి వేషంలో మరియు పోతరాజు వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బతుకమ్మలు, మేడారం సమ్మక్క సారక్క జాతర విశేషాలు పీర్ల పండుగ విశేషాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆషాడ మాసంలో ప్రత్యేకంగా జరిగే బోనాల జాతర విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జీలు ఎడ్విన్, శైలజ, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, షాజహాన, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.